# బహిష్కరణ

రచయిత్రి :
శ్రీమతి పి. మాణిక్యం

అది చల్లనిసాయంకాలం. పశువులు గూటికి చేరేసమయం.

చల్లని పిల్లగాలులు జంటలకు ఆహ్లాదపరచే సమయం. విరబూసినపూలు సువాసనలను వెదజల్లి ఆ ప్రేమికుల్ని తన్మయుల్ని చేస్తున్నాయి.

'కుసుమా!' మృధువుగా పిల్చాడతను.

'ఊఁ!'గాఢంగా అంది.

'రేపు నా బర్త్‌డే.'

'నిజం!' ఆమెకళ్ళలో ఆశ్చర్యం.

'పార్టీకి నువ్వు తప్పక రావాలి.'

'ఎవరెవ రొస్తారు?' అడిగింది కుసుమ.

'మవ్వొక్కదానివే.'

'సారీ, ప్రతాప్.'

'ఏం నిన్నేమయినా కొరుక్కుతినేస్తానని భయమా?'

'కాదు.'

'మరి.'

'లోకంగురించికూడా ఆలోచించాలిగా. ఒంటరిగా నీ రూమ్‌కి వస్తే?'

'లోకం-లోకం నీకు ఆకలివేస్తే అన్నం పెడుతుందా లోకం?'

'ప్రతాప్ మనకు లోకం ఏవిధంగా సహాయపడక పోవచ్చు. మన నడవడిని గమనించి గోరంతలు కొండం తలుచేసి విమర్శిస్తూ వీలైనంత చెడ్డగా ప్రచారం చెయ్యడమే లోకోద్దేశ్యం. అందుకు అవకాశం ఇవ్వకుండా జాగ్రత్తపడడం మనవంతు' అంది కుసుమ.

'ఆ కుంటుసాకులన్నీ ఎందుకు చెప్పు. నారూమ్‌కు రావడం ఇష్టంలేదని ఒక్కముక్క చెప్పేత్తే సరిపోయేది గదా!' అన్నాడు ప్రతాప్,

'నన్ను అర్థం చేసుకో ప్రతాప్, ప్లీజ్.'

'ఇప్పటి కర్థం చేసుకున్నది చాలు' ఆమె పిలుస్తున్నా వినిపించుకోకుండా వెళ్ళిపోయాడు ప్రతాప్,

ఒట్టి తొందరపాటు మనిషి. ఇప్పుడు తను మంచిగా లోకం తీరు చెప్పింది. అత నంతగా బాధపడుతున్నప్పుడు ఒకసారి వెళితే ఏం పోయింది, అనుకుంది కుసుమ.

* * *

సిగరెట్టుమీద సిగరెట్టు కాలుస్తూ ఆమె రాకకోసం ఎదురు చూస్తున్నాడు ప్రతాప్.

ఆమె తప్పక వస్తుందని అతనికి తెలుసు.

అంతలో-

కుసుమ రావడంచూసి కాలుస్తున్న సిగరెట్ అవతలకు విసరేసి చిరునవ్వుతో-

'వెల్‌కమ్ డియర్!' అంటూ ఆహ్వానించాడు.

చిరుకోపలతో అతనివైపోసారిచూస చాపమీద కూత్చుంచి కుసుమ.

టేబుల్‌మీద స్వీట్సు సర్ది-

'అమ్మాయిగారూ పార్టీ రడీ! దయచేస్తారా! పిల్చా డతను లేచి కుర్చీలో కూర్చుంటూ.

'ఇవన్నీ ఎందుకు ప్రతాప్. అనవసరంగా మనీ వేస్టు' అంది.

నవ్వాడు ప్రతాప్.

'వేస్టు, ఏది వేస్టుకాదు కుసుమా. జీవితమే వేస్టు. బ్రతికిఉండగానే లైఫ్ ఎంజాయ్ చెయ్యాలి. ఈరోజుల్లో. రేపనేదానికోసం ఎదురుచూడడమంటే బుద్ధితక్కువ మరొకటిలేదు. ఈరోజు వేస్టయ్యేది మనమే. కాని రేపు పుట్టిన రోజుకి ఈమనిషే ఉండకపోవచ్చు.'

'ప్రతాప్ దయచేసి అలా మాట్లాడకు. నీవు లేకున్న వూహ భరించలేను.' ఆమెగొంతు గాద్గధికమైంది. కళ్ళల్లో నీళ్ళు.

'ఛ. ఏమిటిది. తమాషాకంటే బాధపడతావేం?' సున్నితంగా ఆమె కన్నీళ్ళు తుడిచాడు ప్రకాష్.

బయట చల్లగాలి. చిన్నతుంపరగా పడుతోంది వర్షం. రేడియోలోంచి సన్నగా కమ్మనిసంగీతం విన్పిస్తాయి.

కబుర్లు చెప్పుకుంటూ స్వీట్సు తిన్నారు. అలా అతనితో కలిసి కబుర్లు చెప్పుకుంటూ తినడం, ఆమెకు చాలా ఆనందంగా ఉంది.

చాలా టైమయింది, వెళ్ళొస్తా'నంటూ లేచింది కుసుమ.

అంతలో-

కరెంటు ఫేయిలయ్యింది.

'అరె!' అంటూ నిల్చుండిపోయింది కుసుమ.

అతను కొవ్వొత్తి వెలిగించాడు.

దబీమంటూ ఆమె భుజంమీద ఏదో పడడంతో కెవ్వుమంటూ అతడ్ని భయంతో కౌగలించుకుంది.

'ఛ. అంతభయమైతే ఎలా? అది ఎలుక - నవ్వుతూ ఆమెను అలాగే తనహృదయానికి హత్తుకున్నాడు ప్రకాష్.

ఆమెకు ఒళ్ళంతా విద్యుత్ ప్రవహించినట్లు అదోలా, మత్తుగా, భ్రాంతిగా ఉంది. తనెందు కిలా అయిపోయిందో అర్థం కాలేదామెకు. అరమోడ్పుకన్నులతో చూస్తూ ఏదో చెప్పాలని నోరు తెరచిన అమెపెదాలను తన పెదవులతో మూసా డతను.

వారిమధ్య తనెందుకనుకుంటూ సిగ్గుతో కరగి ఆరి పోయింది క్రొవ్వొత్తి.

* * *

మనసేం బాగాలేదు కుసుమకు.

తను విన్నది నిజమా? ఎన్నో తియ్యనికబుర్లతో; మరెన్నో చిలిపిచేష్టలతో తన మనసు దోచుకున్న ప్రకాష్? నమ్మలేక పోతోం దామెహృదయం,

ఎంతో పదిలంగా, పవిత్రంగా అతనిరూపాన్ని తన హృదయంలో దాచుకుంది,

తియ్యని ఊహలతో.

ఎన్నో ఆశలతో.

కోటి కోర్కెలతో.

తన కాబోయే భర్తగురించి ఎదురుచూస్తుంది కన్నెపిల్ల. అదే ప్రేమించినవాడయితే ఇంకేం కావాలి. ప్రేమాను రాగాలు పంచిఇచ్చే ప్రియుడే భర్త కావడంకంటే అదృష్టం మరొకటుంటుందా?

కను కన్న కలలన్నీ కరిగిపోయి కన్నీళ్ళయితే ?

తను అల్లుకున్న ఆశాసౌదాలు ఒక్కసారి కూలిపోతే ?

పిడుగులాంటివార్త వినాల్సివస్తే ?

ఆరోజు-ఆమె ఏం కావాలి? ఏం చెయ్యాలి ?

మామూలుగా కాలేజీకి వెళుతున్న కుసుమకు ఎవరో తననే ఉద్దేశించి 'ఏమండీ' అని పిలవడంతో-

వెనక్కి తిరిగి 'ఏం' అన్నట్లు ప్రశ్నార్థంగా చూసిం దామెవైపు.

ఆమెకు పందొమ్మిదేళ్ళు వుంటాయి. చామనచాయ రంగు, గుండ్రనిముఖం, చక్రాల్లాంటి కళ్ళు, తెల్లనిదుస్తుల్లో నిగనిగలాడేయవ్వనంతో ఆకర్షణీయంగా ఉందామె.

'సారీ, ప్రకాష్‌ను మీకు తెలుసో, తెలియదో?'

'తెలుసు, చెప్పండి' అంది కుసుమ. అప్పటికే ఆమె క్లాసుకు లేటయ్యింది.

'ఒక్కసారి నేను, అంటే రజని వచ్చిందని చెప్తారా?' అందా అమ్మాయి.

ప్యూన్‌ని పిలిచి ప్రకాష్‌కోసం పంపించి-

'అతనితో మీకేం పని?' కుసుమ అంది.

'అది, మా పెళ్ళివిషయం మాట్లాడాలి' అని రజని చెప్పింది.

కళ్లు గిర్రున తిరిగాయి కుసుమకు.

'మీరు చెప్పేది ఏ ప్రకాష్ గురించి' నమ్మలేనట్లు ప్రశ్నించింది కుసుమ.

'ఈ ప్రకాష్' అంటూ, తన జాకెట్లో పదిలంగా దాచిన అతని ఫోటో అందించిం దామెకు;

ఆ ప్రకాష్, ఈ ప్రకాష్, ఒక్కరు కాకూడదని మనసు లోనే ప్రార్థించుకుంది. కాని-

ఒక్కసారి భూమి తలక్రిందులయి పోతున్నట్లు, నిలబడేశక్తి నశించిపోయినట్లు, ఆ ఫోటో చూస్తూనే కూలబడి పోయింది. అది ప్రకాష్ ఫోటో.

'ఏమైందండి.' కంగారుగా అడిగింది రజని.

'అబ్బే, ఏం లేదు. కాస్త కళ్ళు తిరిగాయంతే' కుసుమ అంది.

'అబాబు కాలేజీకివచ్చి వారంరోజులయిందని చెప్పారమ్మా!' అనిచెప్పి వెళ్ళాడు ప్యూను.

మా ప్రత్యేక తయారింపులు : :

- 100% ఫైన్
- పాయల్ ఫైన్
- జిప్పీ ఫైన్
- మైసన్ ఫైన్
- రాకెట్ ఇంటర్ లాక్

R.K.S. KNITTINGS TIRUPUR

Regd. No. 342215

**R. K. S. Knittings**

43, Cauvery St, TIRUPUR - 638 602.

'అయ్యో! ఇప్పుడెలా!' అంది రజని.

'అంత అర్జంటా?' కుసుమ అడిగింది.

'ఔనండీ! నాకు మావాళ్ళు వేరేసంబంధాలు చూస్తున్నారు. ముహూర్తంకూడ నిర్ణయం చేసారు. పైగా నేను నెలతప్పానుకూడా. మావాళ్ళకు ఈవిషయం తెలిస్తే ఇంకేమైనా ఉందా? అందుకే అతనితో మాట్లాడాలి. అతను మీకు కన్పిస్తే తప్పక చెప్తారుకదూ?' అంటూ కుసుమతో చెప్పి వెళ్ళిపోయింది రజని.

తను విన్నది నిజమా? ప్రకాష్ నిజంగా మోసగాడా?

ఆడపిల్లలని విలాసవస్తువుల్లా ఉపయోగించుకుంటున్న మూర్ఖుడా?

జీవితానికి అర్థం తెలియని అజ్ఞానవంతుడా?

అదే నిజమైతే తనిప్పు డేంచెయ్యాలి?

తన సర్వస్వం అతని కర్పించిందే?

మనసంతా వికలమైపోయింది. లెసన్సు విన బుద్ధికాక ఇంటికి వచ్చేసిందే కాని మనసు కుదుటపడలేదు.

తను విన్నది స్నేహితురాలితో చెప్పకుండేవరకూ తన మనసు తేలికపడదు. లేచి సుధ దగ్గరకు బయలుదేరింది కుసుమ.

* * *

రెండేళ్ళక్రితం.

సుధతో వాళ్లింటి కెల్లిన తనకు-

'మా కసిన్‌బ్రదర్. ఈమె నా స్నేహితురాలు' అంటూ పరిచయం చేసింది ఇద్దరికి సుధ.

అలా పరిచయమైన వాళ్ళస్నేహం దినదినాభివృద్ధి చెంది ప్రేమగా మారింది.

అతనిసమక్షంలో ఆమెకు యుగాలు క్షణాల్లా-

గంటలు నిమిషాల్లా గడచిపోతాయి.

అతను మాట్లాడుతుంటే, మంత్రముగ్ధలా వింటూ కూర్చోవాలని, ఆకళ్ళలో - అయస్కాంతం ఉన్నట్లు అతనివెంతనే ఎప్పుడూ ఉండాలని ఉంటుంది.

ప్రపంచాన్ని రంగురంగుల అద్దాల్లోంచిచూస్తే అంతా అందంగా, కష్టాలేలేని రమణీయమైన ప్రపంచంగానే కన్పిస్తుంది. ఆవయసు అలాంటిదేమో. అందులోంచి చూసినవాళ్లు వాస్తవాన్ని గ్రహించలేరు. అది గ్రహించే సరికి వాళ్ళభవిష్యత్ వారిచేతుల్లోంచి జారిపోతుంది. ఆడపిల్లలను లోబరుచుకొని, వారిజీవితాలతో ఆడుకోవడం అతని హాబీ అని గాని, ఆ మాటలచమత్కారంతో వాళ్ళ జీవితాలకు నిప్పుపెట్టేగుణం ఉందనిగాని ఊహించలేదు కుసుమ.

ప్రేమ పేరుతో అమ్మాయిలజీవితాన్ని నాశనంచేస్తున్న ఇలాంటి చీడపురుగుల్ని ఏ సంఘం, కోర్టు శిక్షిస్తుంది? ఎవరికి జరిగిన అన్యాయానికి వారే శిక్షించాలి.

ఆడదానిలో తల్లిని, చెల్లిని, చూడడానికిబదులుగా-ఆట వస్తువులుగా, అవసరానికి పనికివచ్చే పనిముట్టుగా, 'ప్రేమ' అనే పవిత్రపదానికి అర్థంలేకుండాచేసి మోజులు తీర్చుకుంటున్న ఇలాంటి మూర్ఖులకు ఎలా బుద్ధి చెప్పాలి.

ఎలా? ఎలా?? ఎలా???

* * *

గేటు తెరచుకొని లోపలికివెళ్ళి తలుపు తట్టబోయిన కుసుమకు లోపలనుండి పెద్దగా మాటలు వినిపించడంతో, వింటూ నిల్చుంది.

'ఛీ; మూర్ఖుడా, అన్నయ్య, చెల్లి అనే మాటలకు అర్థం తెలుసా నీకు? ఆపదాల్లో ఉండే పవిత్రతకు అర్థం తెలియని నీ చదువెందుకు?'

అది సుధ గొంతు.

'అన్నయ్య, చెల్లి ఇవన్నీ గదిబైట పిలుచుకునేందుకు అందంగా ఉంటాయ్. ఇక పోతే పవిత్రమేమిటి? ఆకలి వేస్తే అన్నం తినడంలేదూ? ఇదికూడా అంతే.'

అని ప్రకాష్ గొంతు.

'అవును, ఆకలివేస్తే అన్నం తింటాంగాని గడ్డి తినం కదా! చెల్లికి, తల్లికి తేడా తెలియని నువ్వు తినాలనుకుంటున్నది గడ్డికూడా కాదు, అసుద్ధమని తెలుసుకో.'

'పెద్ద పతివ్రతలా మాట్లాడకు. రమేష్, నువ్వు ఎన్ని సార్లు తోటలో?'

ఆపై వినలేకపోయింది కుసుమ.

'అవును. అతను, నేను ప్రేమింతుకున్నాం పెళ్ళి చేసుకుంటాం ఖచ్చితంగా చెప్పింది.

'ప్రేమ....ప్రేమ....ఏమిటే ప్రేమంటే? ఒళ్లు తిమ్మిరెక్కితే వారికోర్కెలను తీర్చుకోవడానికి అందంగా 'ప్రేమ' అని పేరు పెట్టుకుంటారు. ఆ రమేష్‌గాడికంటే నేనేం తీసిపోయాను!!

TEXTOM®
VESTS & BRIEFS

Tel: 'TEXTOM' Phone: 23209
TEXTOM KNITTERS
5-A (1) Ramanagar 4th Street, TIRUPUR-638 602

'అన్నయ్యా!' ఇంటిపై కప్పు ఎగిరిపోయేలా అరచింది సుధ.

'సరోజ, రాజి, భారతి, రజని, వీళ్ళంతా ఒకప్పుడు ఇలాగే పిల్చేవారు. ఇప్పుడు వాళ్ళంతా నాకౌగిలికోసం తపించిపోతున్నారు' సిగరెట్టుతీసి వెలిగించాడు ప్రకాష్.

'నువ్వింత దుర్మార్గుడివని తెలియక నా స్నేహితురాలు మోసపోయింది. నీ నిజస్వరూపం చెప్తా'నంటూ తలుపు దగ్గరకు నడుస్తున్న ఆమె చెయ్యిపట్టి వెనక్కు లాక్కున్నాడు.

'ప్లీజ్, నన్నొదులు. నీకు దండం పెడతాను' అంటూ, వేటగాడుబారినుండి తప్పించుకోవాలని ప్రయత్నించిన లేడిలా....కషాయివాడికత్తికి బలయిపోయిన గొఱ్ఱెపిల్లలా గిలగిలలాడిపోతుంది సుధ.

కుసుమ ముఖం కోపంతో ఎఱ్ఱగా తయారైంది. ఆమె పిడికిళ్లు బిగుసుకున్నాయి. భద్రకాళిలా తలుపులపై బాదుకొంది.

ఆమెతలలో తళుక్కున ఒకమెరుపు మెరిసింది. ఓ కర్రపుల్లతో గడియతీసి నిశ్చేష్టురాలయి నిల్చిపోయింది బొమ్మలా.

అప్పటికే—

ఆమెశీలాన్ని హరించివేసాడా రాక్షసుడు. రెండు చేతుల్లో ముఖం దాచుకొని ఏడుస్తోంది సుధ.

చుట్టూ చూసింది కుసుమ. ఓ మూలగామాత్రం కన్పించిందామెకు.

ప్రపంచాన్నే జయించిన చక్రవర్తిలా ఆమెమీదనుండి లేవబోయిన ప్రకాష్ నెత్తిమీద పిడుగులా పడింది రాయి.

ఊహించని ఈ పరిమాణానికి తట్టుకోలేక క్రింద పడిపోయాడతను. అప్పటికే అతని తలలోంచి విపరీతంగా కారుతోంది రక్తం.

అలాగే కళ్ళప్పగించిచూస్తూ, 'కు.సు.మ' అన్నాడు.

'అవున్రా కుసుమనే. ఆడపిల్లల జీవితాలతో ఆడుకుంటున్న నీలాంటి చీడపురుగుల్ని ఒకొక్కటే ఏరిపారేయకపోతే ఈ ప్రపంచాన్నే వాలిచేసే ప్రమాదముందిరా, నీలాంటి నరరూపరాక్షసులు బ్రతక్కూడదు, ఇలాంటి కిరాతకుల్ని ఊరిమండే కాదు. సంఘంనుండి. దేశంనుండి, ప్రపంచాన్నుండే బహిష్కరించాలి. ఈసంఘం, కోర్టు మీలాంటి మేకవన్నె పులుల్ని బహిష్కరించలేదు. ప్రతి ఆడపిల్ల తనకు కలిగిన అన్యాయానికి తనే శిక్షించాలి, బ్రతకనివ్వకూడదు' అంటూ అలాగే కొడుతూనే ఉంది, అతను బాధతో గిలగిలా తన్నుకుంటూంటే పకపకా నవ్వసాగింది.

'అమ్మాయిల్ని మోసంచేసినప్పు డేమయిందీబాధ. నీ మోసానికి బలయిపోయి రజనిలాంటివాళ్లు ఎందరు ఆత్మహత్యలు చేసుకున్నారో? నీకామానికి ఆహుతిఅయి ఎందరు వేశ్యలయ్యారో, నీ మాయమాటలు నమ్మి ఎందరు పిచ్చివాళ్ళయ్యారో, నీ పశుత్వానికి బలయిపోయి ఎందరు కుమిలి కుమిలి ఏడుస్తున్నారో అందర్నీ నాశనంచేసిన నీకు బాధగా ఉందా?' అతని శ్వాస ఆగిపోయేవరకూ కొడుతూనే ఉంది. తరువాత పిచ్చిగా వగలబడి నవ్వసాగింది.

'అమ్మా;' అంటూ పడిపోయాడు.

'అమ్మ!' ఆమాటకు అర్థం తెలుసా నీకు? తల్లి, చెల్లి అనే విచక్షణాజ్ఞానం లేకుండా కనిపించిన ప్రతి ఆడదాన్నీ అనుభవించినప్పు డేమయిందీ జ్ఞానం,

అప్పుడే వచ్చిన సుధ తండ్రి గోవిందయ్య - అయోమయంగా చూస్తూ-

'ఏమైందమ్మా! ఏమిటీ రక్తం. ఎందుకలా నవ్వుతున్నావ్. అయ్యో ఏమిటీ ఘోరం' అని అరుస్తున్నా, కుసుమకు అవేమీ వినిపించలేదు. ఆమె కళ్ళకెవరూ కన్పించలేదు. అలా నవ్వుతూనే ఉంది. ఇంకా నవ్వుతోంది. నవ్వుతూనే ఉండిపోయింది.